# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- విద్యార్థులు స్వంతంగా అభ్యాస విధానాలను అలవర్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు.
- వందేమాతరం కోస్ట్ గార్డ్ సైక్లోథాన్-2026 దేశవ్యాప్తంగా ఒక ఉద్యమంలా మారిందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు.
- దేశవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 8 కోట్ల 47 లక్షలకు పైగా రైతు గుర్తింపు కార్డులు జారీ చేయబడ్డాయని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు.
- అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్-2026 టైటిల్ ను భారత్ కైవసం చేసుకుంది.

= = = = = = = = = = = = = = = = = = =

పరీక్షల ముందు ఒత్తిడిలో ఉండే విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపే లక్ష్యంతో చేపట్టిన పరీక్షాపే చర్చ 9వ ఎడిషన్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు విద్యార్థులతో సంభాషించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఈరోజు ప్రధానమంత్రి ఎక్స్ వేదికగా పంచుకున్నారు. విద్యార్థులు తమ స్వంత ప్రత్యేకమైన అభ్యాస విధానాలను అలవరుచుకోవాలని, పరీక్షలను పండుగలా చేసుకోవాలని నరేంద్రమోదీ సూచించారు. ఏ ఇద్దరు వ్యక్తులు ఒకే విధంగా ఆలోచించరని, ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేకమైన శైలి ఉంటుందని, దానిపై పూర్తి నమ్మకం ఉంచాలని ఆయన పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇచ్చే సూచనలను జాగ్రత్తగా విని, వాటిని లోతుగా అర్థం చేసుకొని ఉపయోగకరమైన వాటిని స్వీకరించాలని ప్రధానమంత్రి సూచించారు. ప్రతి విద్యార్థి నేర్చుకునే వేగాన్ని ఉపాధ్యాయులు సున్నితంగా గమనించాలన్నారు. విద్యార్థులు వ్యాయామం, యోగా, పోషకాహారం, తగినంత విశ్రాంతి, మానసిక బలాన్ని వారి దినచర్యలో అలవరుచుకోవాలని ఆయన కోరారు. విద్య అనేది జీవితాన్ని నిర్మించే సాధనంగా ఉండాలని పేర్కొన్నారు. జీవితం.. పరీక్షలు, మార్కులకే పరిమితం కాదని ప్రధానమంత్రి సూచిస్తూ…

(వాయిస్…24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశ భద్రత, తీర ప్రాంత రక్షణపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన వందేమాతరం కోస్ట్ గార్డ్ సైక్లోథాన్-2026 దేశవ్యాప్తంగా ఒక ఉద్యమంలా మారిందని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. వందేమాతరం గీత రచనకు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం సి.ఐ.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన వందే మాతరం కోస్ట్ గార్డ్ సైక్లోథాన్-2026 ఈ సాయంత్రం విశాఖపట్నం సాగతీరానికి చేరుకుంది. ఆర్.కె బీచ్ లో ఈ సైకిల్ యాత్రకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సురక్షిత తీరాలు – సమృద్ధ భారతం అనే నినాదంతో చేపట్టిన ఈ సైక్లింగ్ యాత్ర.. తీరప్రాంతంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్న విశాఖపట్నం చేరుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా 9 తీర ప్రాంత రాష్ట్రాల మీదుగా సుమారు 6 వేల 500 కిలోమీటర్లు ఈ యాత్ర సాగుతుందని రామ్మోహన్ నాయుడు పేర్కొంటూ…

(వాయిస్…24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

భారత-ఈయూ (EU) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత్, యూరోపియన్ యూనియన్ కు గేమ్-ఛేంజర్‌గా మారుతుందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఇండియా-యూరోపియన్ యూనియన్ ఫోరం ప్రారంభ సమావేశంలో కేంద్ర మంత్రి ప్రసంగిస్తూ.. భద్రత, రక్షణ, వాతావరణం, సాంకేతికత వంటి రంగాలకు కూడా ఇది ప్రయోజనం చేకూర్చుతుందన్నారు. ఈ ఫోరమ్ భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య సంబందాన్ని మరింత బలోపేతం చేస్తుందని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 8 కోట్ల 47 లక్షలకు పైగా రైతు గుర్తింపు కార్డులు జారీ చేయబడ్డాయని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. 2026-27 నాటికి పదకొండు కోట్ల మంది రైతులకు గుర్తింపు కార్డులను అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన తెలిపారు. రాజ్యసభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో అనుబంధ అంశాలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమాధానమిస్తూ, ప్రస్తుతం 19 రాష్ట్రాల్లో రైతు గుర్తింపు కార్డులను అందజేస్తున్నామని తెలిపారు. రెండు కోట్ల 90 లక్షల మంది రైతులు జాతీయ పంట బీమా పోర్టల్‌తో అనుసంధానించబడ్డారని ఆయన తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో, రైతుల ఆదాయాన్ని పెంచడం, ఆహార భద్రతను నిర్ధారించడం, సామాన్యులకు పోషకాహారాన్ని అందించడంపై దృష్టి పెట్టడమే ప్రభుత్వ వ్యవసాయ విధాన లక్ష్యమని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారతీయ రిజర్వ్ బ్యాంక్ కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచాలని నిర్ణయించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ (RBI) గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈరోజు వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 2.1శాతంగా ఉండొచ్చని, ఇది 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 4శాతం, రెండో త్రైమాసికంలో 4.2శాతంగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇటీవల కుదిరిన భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం, త్వరలో జరగనున్న భారత్-అమెరికా ట్రేడ్ డీల్.. దేశీయ వృద్ధిని మరింత బలోపేతం చేయనున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4శాతం వృద్ధి నమోదవుతుందని, వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9శాతం, రెండో త్రైమాసికంలో 7శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడిస్తూ...

(వాయిస్…33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

జింబాబ్వేలోని హరారే వేదికగా జరుగుతున్న అండర్-19 క్రికెట్ ప్రపంచ కప్-2026 ఫైనల్ మ్యాచ్‌లో భారత్, ఇంగ్లాండ్ పై ఘన విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగులు చేసి, 412 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ముందు ఉంచింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఇంగ్లాండ్ 311 పరుగులకు ఆలౌటయ్యింది. భారత ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ 175 పరుగులు చేసి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (PMAY-G) కింద రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ప్రభుత్వం 3 కోట్ల 87 లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేసిందని గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెల 2వ తేదీ నాటికి మంజూరు చేయబడిన ఇళ్లలో రెండు కోట్ల 95 లక్షలకు పైగా ఇళ్లు పూర్తయ్యాయని వెల్లడించారు. ఈరోజు రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ... గత ఐదు సంవత్సరాలలో రెండు కోట్ల 10 లక్షల 66 వేలకు పైగా ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. మార్చి 2029 నాటికి నాలుగు కోట్ల 95 లక్షల ఇళ్లను నిర్మించడానికి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 2016 ఏప్రిల్ 1 నుండి ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్‌ను అమలు చేస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 266 పాయింట్లు లాభపడి, 83,580 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 50 పాయింట్లు పెరిగి, 26,693 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 36 పైసలు కోల్పోయి.. 90.70 గా స్థిరపడింది. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములు లక్షా 52 వేల 350 రూపాయలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =